# వస్తు ప్రపంచంలో

**బా**ధలు ప్రపంచమంతటా ఉన్నాయి. హృదయాలు మాత్రం కొందరికే ఉన్నాయి.

★ ★ ★

జనవరి ఒకటో తారీకు ఇల్లంతా నిద్ర లేచింది గానీ కరుణాకరే ఇంకాలేవలేదు. బయట దట్టంగా మంచు పడుతోంది. ఆవరణలో గులాబి చెట్లు కన్నీళ్ళు కారుస్తున్నట్టున్నాయి. ఆ సమయంలో అతని ఇంటి కో ప్రాణి వచ్చింది. వచ్చింది మనిషైతే శుభాకాంక్షలు చెప్పటాని కనుకోవచ్చు

కానీ అది కుక్క పిల్ల.

'కుయ్! కుయ్! కుయ్!'

అది సన్నగా బక్కచిక్కిపోయి ఉంది. చలికి వణికి పోతోంది. ఎరుపు తెలుపు మచ్చల్తో ఆకర్షణీయంగానే ఉంది. దాని కంఠంలో ఏదో బాధ. కొయ్య గేటును కాళ్ళతో గీరుతూ లోపలికి రావాలని ప్రయత్నిస్తోంది.

లోపల్నుంచి ఆరేళ్ళ శాంతి పరిగెత్తుకుంటూ వచ్చింది. గేటు తీసీ తియ్యగానే అది ఏమాత్రం బెదురు లేకుండా సరాసరి ఇంట్లోకి వచ్చింది.

స్టౌమీద అప్పుడే కాఫీ పెడుతుంది సరళ. కుక్క పిల్లని చూడగానే విసుక్కుంది.

"దీ న్నెక్కడ తోలు కొచ్చావే నువ్వు? ఇంట్లో ఆగం చాల్లేదనా?"

"కుక్క పిల్ల బాగుందే అమ్మా! దీన్ని మనం పెంచుకుందాం" అంది శాంతి కుక్కపిల్ల వెనకే వచ్చి.

"పెంచి నట్టే ఉంది. మీ ఇద్దరితోనే తల ప్రాణం తోక్కొస్తుంటే నెత్తి మీదికి మరొకటా?"

కుక్క పిల్ల ఇదేమీ పట్టించుకోలేదు. కుయ్ కుయ్ మంటూ గదులన్నీ తిరిగింది. శాంతి పట్టుకుందామన్నా చేతుల్లో నిలవలేదు

వసారా పక్క గదిలో సీను తల దువ్వుకుంటున్నాడు. ఆ రోజు సెలవు కాబట్టి పొద్దున్నే ప్లే గ్రౌండ్ లో క్రికెట్ ప్రాక్టీసు చెయ్యాలి.

"ఎక్కడిదే ఈ కుక్క పిల్ల? సరాసరి గదిలోకే తెచ్చావ్?"

"పాపం, గేటు బయట ఏడుస్తూందిరా. మనంపెంచుకుంటే బాగుండదూ?"

"ఓ, బ్రహ్మాండంగా ఉంటుంది. ఆ కిష్టిగాడు ప్లేగ్రౌండ్ కి కూడా వాడి కుక్క పిల్లని తెస్తాడు. ఆల్సేషియన్ డాగ్ అంటాడు గానీ అన్ని కోతలు. దాని కంటే ఇదే బాగుంది. మంచి పేరు పెడదాం."

"పప్పీ అంటే బాగుండదూ?"

"పప్పీ ఏంటే పప్పు లాగా? పింకీ అంటే బాగుంటుంది"

"పింకీ ఏమిటి పెంకు లాగా? నాకు పప్పీనే బాగుంది."

"సరే. కానీ, నేను బయటి కెళ్తున్నా మంచి తాడు చూసి కట్టెయ్యి. రేపు నాన్నని గొలుసు తెమ్మందాం" అంటూ సీను హుషారుగా వెళ్ళిపోయాడు.

శాంతి కుక్కపిల్లనే సంతోషంగా గమనిస్తోంది. ఎన్నిసార్లు పట్టుకుందామన్నా మళ్ళీ కిందకే దూకుతోంది. గదంతా తిరిగి తిరిగి మూలనున్న పరుపు చాటుకు వెళ్ళి పడుకుంది. 'పాపం' రాత్రంతా నిద్ర లేదు కాబోలు' అనుకుంది శాంతి.

చూస్తూండగానే కుక్క పిల్ల నిద్ర పోయింది. శాంతి వంకె నున్న తువ్వాల్లుతీసి నిశ్శబ్దంగా దాని మీద కప్పి ఇవతలికి వచ్చింది.

కరుణాకర్ నిద్ర లేచాడు. క్రితం రోజంతా ప్రయాణం చేసి ఉండటం వల్ల బడలిక ఇంకా తగ్గలేదు.

"సరళా! కాఫీ ఇవ్వవోయ్ కాస్త" అంటూ కేకేశాడు.

"బాగానే ఉంది. ఈ రోజు కూడా మొహం కడుక్కుండానే కాఫీ తాగుతారా? లేవండి లేవండి" అంది సరళ.

ఇంతలో శాంతి నాన్న దగ్గరికి వచ్చింది.

"నాన్నా! నాన్నా! ఇవాళ మనింటి కెవరొచ్చారో తెలుసా?"

ఇంత పొద్దున్నే ఎవరై ఉంటారబ్బా? ఆలోచనలో పడ్డాడు కరుణాకర్.

"మీ చదరంగం స్నేహితులేం కాదు లెండి. ఎక్కడిదో కుక్క పిల్ల వచ్చింది. మిమ్మల్ని చూసి పోదామని" అంది సరళ నవ్వుతూ.

"కుక్క పిల్లా? సరి సరి."

"నాన్నా! ఎంత బాగుందనుకున్నావ్? భలే ముద్దొస్తూంది. దానికి మంచి గొలుసు తీసుకురా నాన్నా" మారాం చేసింది శాంతి.

"అలాగేలే" అంటూ కరుణాకర్ ఒక్కసారి ఆవలించి పక్క మీద నుంచి లేచాడు. బ్రష్ తీసుకుని బాత్ రూమ్‌కి వెళ్ళాడు. మొహం కడుక్కుని వచ్చి తువ్వాలు కోసం వెతికితే కనబడలేదు.

"ఏమోయ్ నాటువలేదీ?" అడిగాడు సరళని.

"పప్పీకి చలిగా ఉంటే కప్పాను నాన్నా! అంది శాంతి.

"అదేం పనే?" అన్నాడు గానీ కరుణాకర్ కూతుర్ని మందలించ లేదు.

సరళ కాఫీ తెచ్చింది. కాఫీ తాగుతూ పేపర్ అందుకోబోతుండగా శాంతి చటుక్కున అడిగింది.

"నాన్నా! పప్పీకి అమ్మా నాన్నా ఉండరూ? దాన్నెందు కలా వదిలేశారు?"

'అమ్మ' అనగానే కరుణాకర్‌కి క్రితం రోజు ప్రయాణం గుర్తుకొచ్చి మనస్సులో దిగులు మొలకెత్తింది.

★ ★ ★

తన తల్లి దాదాపు మూడేళ్ళ నుంచీ తమ్ముడి దగ్గరే ఉంటోంది. తండ్రి ముందే కాలం చేశాడు. అప్పుడప్పుడూ వెళ్ళి చూసి రావటమే గాని తల్లిని తన దగ్గరికి తెచ్చుకోలేకపోయాడు. వారం రోజుల నాడు అమ్మ ఉత్తరం రాయించింది, ఒక్కసారి చూసి వెళ్ళమని. ఎప్పుడూ ఇలా కబురు చేసి ఎరగదు. అతి కష్టం మీద బాంకులో సెలవు సంపాదించి మద్రాసులో ఉన్న తల్లిని చూట్టాని కెళ్ళాడు. అప్పుడే మొదటిసారి ఆ ఇంట్లో తల్లి పడుతున్న బాధని గమనించాడు.

ఇంట్లో ఎవరి దారి వాళ్ళది. తమ్ముడు మంచి ఉద్యోగంలోనే ఉన్నాడు. అయితే ఎప్పుడూ కాంపుల్లోనే. మరదలికి స్నేహితురాళ్ళతో క్లబులకీ, మీటింగులకీ తిరగటమే సరిపోతుంది. ఇద్దరు కొడుకులకీ చదువైతే సరిగా అబ్బ లేదు గాని ఇతర కాలక్షేపాలు బాగానే ఉన్నాయి. ఇక అమ్మని పట్టించుకునే దెవరు? ఇంట్లో ఒక మూల గదిలో మంచంలో పడి ఉంటుందెప్పుడూ. సమయానికి మందు అందించే వాళ్ళు లేరు. పిలిస్తే పలికే వాళ్ళు లేరు. తను వెళ్ళే సరికి ఇంట్లో పని మనిషి తప్ప పురుగు లేదు. అమ్మ తనని కావలించుకుని పసిపిల్ల లాగా ఏడ్చింది. తనకీ కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి.

"నాయనా! నేనిక్కడ ఉండలేనురా నీ వెంటే నన్ను తీసుకుపో."

"అదేమిటే? ఎందుకు దిగులు? కోడలు సరిగా చూట్టం లేదా?"

అప్పుడు అమ్మ పూస గుచ్చినట్టు సంగతులన్నీ చెప్పింది. కొడుకు ఎప్పుడో తప్ప కనబడడు. కోడలూ, పెద్ద మనవడూ అసలు తన గదిలోకే రారు. ముసలి వాసనట. చిన్న మనవడే ఎప్పుడైనా పలకరిస్తాడు. అన్నం కూడా పని మనిషి తీసుకు రావాల్సిందే. బుద్ధి పుట్టినప్పుడు మాత్రం మందులు కొనిస్తారు. లేకుంటే లేదు. ఒక్క రోజు మందు వేసుకోకపోయినా కీళ్ళ నొప్పుల్తో మంచం దిగలేదు తను. వారం కిందట కోడలికీ, తనకీ మాటా మాటా వచ్చింది. నెల రోజుల్నుంచి మందులు కొనివ్వక పోతే నోరు తెరిచి అడగటం నేరమైంది. లిప్‌స్టిక్కుల కోసం, పౌడర్ల కోసం వందలు వందలు తగలేసే కోడలు "ఇక్కడ డబ్బులేం చెట్టుకి కాయటం లేదు" అన్నది.

"నా పొలం ఉంది గదరా నాయనా. ఆ డబ్బంతా ఏమవుతుందని అడిగాను. నా

జానెడు పొట్టకి ఎంత ఖర్చవుతుందిరా?"

తనేమీ మాట్లాడ లేదు. తమ్ముడి తత్వం తనకి తెలియంది కాదు. కానీ తల్లిని పట్టించుకోనంత నిర్దయగా ఉంటాడనుకోలేదు.

" ఆకోపం మీద నేను మా పెద్దాడి దగ్గర కెళ్ళి పోతానన్నాను. మహారాజు లాగా వెళ్ళమంది. నేనిక్కడుండలేనురా కరుణా. మందులూ, మాకులూ లేకపోయినా రోజు కొక్కసారి పలకరించే దిక్కైనా ఉంటే నా కింత దిగులుండక పోను. మనుషుల కోసం మొహం వాచి పోయాననుకో. వాణ్ణి నవమాసాలు కని, పెంచానే నా మీద వాడికి దయ లేకుండా పోయింది" అంటూ వాపోయింది అమ్మ.

ఒక్కసారి తనకి చిన్నతనం గుర్తొచ్చింది. అమ్మ తమ ఇద్దర్నీ చెల్లెల్ని సమానంగానే పెంచినా ఏమూలో తమ్ముడంటేనే ఎక్కువ ప్రేమ చూపించేది. ఆటల్లో వాణ్ణెప్పుడైనా తను కొట్టినా "వాడు చిన్నాడు గదరా, నువ్వే కాస్త సర్దుకు పో" అనేది. నాన్న కొట్టినప్పుడు కన్నీళ్ళతో ఒదార్చేది. తమకి పెట్టకుండా ఏనాడు తినలేదు. తామిద్దరూ చదువులకి వెళ్ళినా ఆమె ప్రాణాలన్నీ తమ మీదనే. తమ్ముడికి టైఫాయిడ్ వచ్చినప్పుడు ఆమె పడ్డ బాధ తన కింకా గుర్తే. తమకి పెళ్ళిళ్ళయి వేరే ఊళ్ళలో స్థిరపడ్డప్పుడూ ప్రతి కష్ట సుఖానికీ పరిగెత్తుకుంటూ వచ్చేది.

నాన్న పోయిన తర్వాత అమ్మ ఎవరి దగ్గరుండాలన్న సమస్య వచ్చింది. తమ్ముడు తనతో తీసుకెళ్తానన్నాడు. అమ్మ సంతోషంగానే ఒప్పుకుంది. అమ్మని వాడే పోషించేటట్టూ, పొలం మీద వచ్చే కౌలు వాడికే చెందేట్టూ నిర్ణయమైంది. రాను రాను తన కర్థమైంది, వాడికి తల్లి మీద కంటే ఆమె వెనుకున్న పొలం, బంగారం – వీటి మీదే ప్రేమెక్కువని, ప్రాణానికి ప్రాణంగా సాకిన తల్లిని వాడెందుకు ప్రేమించ లేకపోయాడో, ఏ జీవిత ప్రమాదంలో తన హృదయం పోగొట్టుకున్నాడో తన కిప్పటికీ అర్థం కాలేదు.

తమ్ముడు మంచి హెూదాలోనే ఉన్నాడు. ఉద్యోగంలో జీతం కన్న పై ఎత్తున వచ్చేది చాలా ఎక్కువ. ఇంట్లో దేనికీ లోటు లేదు. సమాజంలో ఉన్నత కుటుంబాలకి తీరాల్సిన 'అవసరాలన్నీ' వాడికి తీరుతున్నాయి. ఆడ పిల్లలు లేరు. వేరే ఏ సమస్యలూ లేవు. మరెందుకు వాడు తల్లి నుంచి దూరమయ్యాడు? బహుశా ఈ వస్తు ప్రపంచంలో ఆత్మీయత అనే వాటికి 'వాల్యూ' లేదని వాడు తెల్సుకుని ఉండాలి. ఆ రోజు సాయం కాలం తమ్ముడితో మాట్లాడుతూ తల్లిని తనతో తీసుకు వెళ్తా నన్నాడు తను. సుధాకర్ విచిత్రంగా చూశాడు. ఏమీ మాట్లాడ లేదు.

"ఇప్పు డంత అవసర మేం వచ్చింది బావగారూ? మేం సరిగా చూట్టం లేదని అనుమానమా ఏమిటి?" అంది మరదలు అందుకుని.

అంతకు ముందు అత్తని వెళ్ళి పొమ్మన్నది ఇప్పుడెందుకిలా మాట్లాడుతుందో వెంటనే అర్థం కాలేకదు తనకి.

"అబ్బే అదేం లేదు లేమ్మా, ఊరికే కొన్నాళ్ళు మాకూ దగ్గరగా ఉంటుందని" తమాయించుకుంటూ అన్నాడు తను.

"అయినా ఇక్కడికి ఎంత దూరం లెండి? కావాలనుకున్నప్పుడల్లా మీరే వచ్చి చూసి పోవచ్చు గదా!" అంది మరదలు మళ్ళీ.

అప్పటికీ తమ్ముడేమీ మాట్లాడ లేదు. దాంతో తల్లిని తనతో పంపటం వాళ్ళ కిష్టం లేదని అర్థమైంది. తల్లి తన దగ్గరే కన్ను మూస్తే ఆమె నగలు, ఆస్తి ఎటు పోతాయోనని వాళ్ళ భయమై ఉండాలి. తల్లితో వీలునామా రాయించుకునే ప్రయత్నంలో ఉన్నట్టు కూడా తెలిసింది.

తనిం కేమీ మాట్లాడ లేకపోయాడు. పక్క గదిలో తల్లి రోదిస్తుందని తెలుసు. కానీ స్వార్థపు పొరల్ని దాటి ఆత్మల్ని స్పృశించేదెలా?

★ ★ ★

"కుయ్! కుయ్"

కుక్క పిల్లకి నిద్ర తీరింది. ఆకలి మాత్రం తీరలేదు. మాటి మాటికీ శాంతి కాళ్ళు నాకుతూ తన బాధ వెల్లడిస్తోంది.

'పాపం, వాళ్ళమ్మ ఎక్కడికో పోయుంటుంది. మరి పప్పీకి పాలు పట్టొద్దూ' అనుకుంది శాంతి. దాన్ని తీసుకుని సరాసరి వంట గదిలోకి వచ్చింది. సరళ వంట ప్రయత్నంలో ఉంది.

"అమ్మా! పప్పీకి బాగా ఆకలవుతుందే.కాసిని పాలు పట్టవే" అడిగింది తల్లిని

"బాగానే ఉంది. లీటరు పాలు ఐదు రూపాయలు. ఇక కుక్క పిల్ల గ్గూడా పట్టించటం మొదలు పెడితే సంసారం గడిచినట్టే" అంది సరళ.

"అలా అయితే నేను తాగన్లేవే. నా వంతు పాలు పప్పీకి పొయ్యి" అంది శాంతి గునుస్తూ.

"చాల్లే నీ మాటలూ, నువ్వూ. అయినా నువ్వు మానక పోయినా మీ నాన్న గారు కాఫీలు మానేస్తే చాలు" అంటూ సరళ ఒక మూకుడులో కాసిని పాలు పోసి పెరట్లో పెట్టింది.

పాలు చూడగానే శాంతి చేతుల్లోంచి ఒక్క దూకు దూకింది కుక్క పిల్ల. తోకాడిస్తూ నిముషంలోనే మూకుడు ఖాళీ చేసింది. నాలుకతో మూతి నాక్కుంది.

"ఇంకా ఆకలి తీర లేదంటే నీకు? మళ్ళీ సాయంత్రం తాగుదువులే. ఇకరా ఆడుకుందాం." శాంతి కుక్క పిల్లతో మాట్లాడుతూ తీసి కెళ్ళింది.

కుక్క పిల్లకి బెదురు పూర్తిగా తీరి పోయింది. హుషారుగా ఇంటి చుట్టూ పరిగెత్త సాగింది శాంతికి చిక్కకుండా. కాసేపు దూరంగా పరిగెత్తటం, మళ్ళీ గబగబా దగ్గరికి వచ్చి

కాళ్ళు నాకటం, వెల్లికి పడుకుని పొర్లి గింతలు పెట్టటం ఆ రోజంతా శాంతికి పప్పీతోనే కాలక్షేపం. పొరుగింటి స్నేహితురాలు వచ్చినా ఆడుకోటానికి వెళ్ళలేదు. సాయంకాలం దానికి నీళ్ళు పోసింది. చన్నీళ్ళ స్నానం దాని కేమీ నచ్చినట్టు లేదు. మాటి మాటికీ ఒళ్ళంతా దులుపుకోసాగింది గుర్రుమంటూ.

సాయంకాలం సీను ఇంటికి వస్తూ కుక్క బిస్కట్లు తెచ్చాడు. ఎక్కడివో గంగరేగు పళ్ళు కూడా తెచ్చాడు అవియ్యబోతే శాంతి ఒప్పుకోలేదు. పప్పీ గొంతు కడ్డం పడతాయని వద్దంది. ఏం ఫర్వాలేదన్నాడు సీను. అయినా విన లేదు శాంతి.

"నా పప్పీ, నా ఇష్టం, నువ్వా రేగు పళ్ళు వేశావంటే ఊరుకోను" అంది కోపంగా.

"నీ పప్పీ ఎలాగైందేం? మీ అమ్మాయా అది?" అడిగాడు సీను చెల్లెల్ని ఉడికిస్తూ.

"చూడమ్మా వీడు? అసలు పప్పీని మొట్టమొదట చూసింది నేను కాదూ?" అంది శాంతి రోషంగా.

సరళ కరుణాకర్ వైపు చూసి నవ్వింది.

"మీ తమ్ముడి పిల్లలూ ఇలాగే కొట్టుకుంటా రండీ ప్రతి దానికీ?" అని అడిగింది.

"ఇద్దరూ ఒక్కచోట ఉంటేనేగా అసలు? ఎవడి షికార్లు వాడివే" అన్నాడు కరుణాకర్.

"ఏంటో పాపం, అత్తయ్య నాకసారి చూడాలనుందండీ?"

"అలాగే వెళ్దాంలే, కొన్నాళ్ళాగి ఇప్పుడే మళ్ళీ వెళితే ఏమనుకుంటారో."

"నేను కూడా వస్తానే నాయనమ్మను చూట్టానికి?" అడిగింది శాంతి.

రాత్రి భోజనాలైన తర్వాత నలుగురికీ పక్కలు వేసింది సరళ. కుక్క పిల్లని వరండాలోకి తీసుకెళ్ళింది. ఒక మూల రెండు పాత గుడ్డలు పరిచింది దాని కోసం. కుక్క పిల్ల హాయిగా నడుం వాల్చింది.

"దానికి చలి పుడుతుందేమోనే!" శాంతి సందేహంగా అడిగింది.

"అందుకని పక్కలో బెట్టుకుంటావా ఏమిటి?" సరళ మందలించింది.

"నాన్నా! రేపు తప్పకుండా మంచి గొలుసు తేవాలి." తండ్రిని హెచ్చరించింది శాంతి.

బయట చలిగాలి వీస్తోంది. కుక్క పిల్ల ముసగదీసుకు పడుకుంది. అయితే దాని కెంతో సేపు నిద్ర పట్ట లేదు. చలితో పాటు తల్లి లేని ఒంటరి తనమూ దాన్ని బాధించి ఉంటుంది. అందుకే ఒక రాత్రి వేళ అది చల్లగా లోపలికి జొరపడి శాంతి పక్కలో దూరి పడుకుంది. దాని కక్కడ హాయిగా, వెచ్చగా నిద్ర పట్టింది.

తెల్లారి లేచేసరికి శాంతి పక్క తడిసి పోయి ఉంది. సరళ పక్కలు తీస్తూ విసుక్కుంది.

"ఎక్కడ తెచ్చావే వెధవ కుక్క, పిల్లని? ఈ దుప్పట్లన్నీ ఎలా ఉతకను?"

"పాప్లేమ్మా ఇవాళ నాన్న గొలుసు తెస్తాడుగా? ఒక మూల కట్టేద్దాం. అయినా అమ్మా, రాత్రిళ్ళు పక్కలు పాడు చెయ్యకూడదని పప్పీ వాళ్ళమ్మ దానికి చెప్పి ఉండదా?"

సరళ నవ్వుకుంటూ దుప్పట్లు తీసేసింది.

★ ★ ★

రోజులు గడిచే కొద్దీ కుక్క పిల్ల కరుణాకర్ కుటుంబంలో ఒక భాగమై పోయింది. దాని కోసం గొలుసు కొని తెచ్చాడు. శాంతికీ, దానికీ మంచి స్నేహం ఏర్పడింది. అది తక్కిన వాళ్ళ దగ్గర భయభక్తుల్లో ఉన్నా శాంతి దగ్గర మాత్రం విచ్చలవిడిగా ప్రవర్తించేది. మీదకు దూకుతుంది. పట్టుకోబోతే చిక్కకుండా పరిగెత్తుతుంది. ఉన్నట్టుండి నేల వాసన చూస్తూ పెరట్లో ఒక మూలకు వెళ్ళి మూత్ర విసర్జన చేస్తుంది.

సీను దానికి రకరకాల 'ఫీట్స్' నేర్పాడు. బిస్కట్ ఎగరేస్తే అది కింద పడకుండా నోటితో పట్టుకోవాలి. దూరంగా ఏ వస్తువు విసిరేసినా పరిగెత్తుకుంటూ వెళ్ళి పట్టుకు రావాలి. రోజూ సాయం కాలం దాన్ని షికారుకి తీసుకు పోయేవాడు.

ఇంటికెవరైనా కొత్తవాళ్ళు వస్తే అది 'భౌ' మంటూ గొంతెత్తుతుంది. ఎంత సముదాయించినా ఊరుకోదు. ఒక్క విషయంలో మాత్రం దానికి 'క్రమశిక్షణ' లేకుండా పోయింది. అది మాటి మాటికీ వంట గదిలోకి రావటం సరళకే మాత్రం నచ్చ లేదు. సరళని చూసి పోవటానికి వచ్చిన తల్లి మీనాక్షమ్మ కూడా కుక్క పిల్లని ఇంట్లోకి రానివ్వటం మంచిది కాదని చెప్పింది.

ఒకోసారి కుక్కపిల్ల తప్పించుకుని వీథుల వెంట పరిగెత్తుతుంది. దాన్ని పట్టుకు రావటం సీను వంతు. అయితే ఎప్పుడైనా బజారు కుక్కలు వెంట బడితే అది 'కుయ్యో' మంటూ తోక ముడిచి వెనక్కి వచ్చేస్తుంది.

కరుణాకర్ కి కుక్క పిల్లను చూస్తుంటే ఎన్నెన్నో ఆలోచనలు వస్తాయి. చిన్నప్పుడు ఎన్నెన్ని కుక్క పిల్లల్ని పెంచిందీ, ఎలా ఆట లాడిందీ కళ్ళ ముందు కదలాడేది. మళ్ళీ తను చిన్న పిల్లవాడై పోతే బాగుండు ననుకుంటాడు.

రోజంతా బాంకు పనితో ఒకటే విసుగు. అది పని చేసేందుకు విసుగు కాదు. ఎంత మంది మనుషలతో తిరుగుతున్నా ఎవరితోనూ యాంత్రిక సంబంధాలు తప్ప ఆత్మీయ సంబంధాలుండవు. ఎవరి ప్రపంచం వారిదే. అందులో రెండో వాడికి ప్రవేశం లేదు.

ప్రపంచం ఎంత పెద్దది? కానీ ఎంత చిన్నది? ఇద్దరు మనుషుల్ని ఆర్థికం తప్ప మరే సూత్రమూ కలప లేకపోవటం ఎంత విషాదం!

సాయంత్రానికి తను బాంకు పని ముగించుకుని ఇంటికి రాగానే కుక్క పిల్ల ఎదురొచ్చి కాళ్ళకు చుట్టుకునేది. అది శాంతి ఒళ్ళో కూర్చుని ఆట లాడుతుంటే తన కెందుకో చిన్నతనంలో అమ్మ ఒడిలో ఆడుకున్న సంఘటనలు గుర్తు కొచ్చేవి. తల్లి

ప్రస్తుత పరిస్థితి తలుచుకుంటే మనస్సు వికలమయ్యేది. పసి పాపకీ, జంతువుకీ మధ్య ఉన్న ప్రేమ తల్లీ బిడ్డల మధ్య లేకుండా పోయింది.

★ ★ ★

ఆ రోజు ఉదయం కరుణాకర్ పేపరు తిరగేస్తుండగా టెలిగ్రామ్ వచ్చింది.

"మదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియేట్లీ."

కరుణాకర్‌కి కాళ్ళూ, చేతులూ ఆడలేదు. సరళ కన్నీళ్ళు పెట్టుకుంది.

వెంటనే బయల్దేరాలి. కానీ శాంతికి ఒంట్లో నలతగా ఉంది, సీనుకి పరీక్షలు. ఏం చెయ్యాలో తోచలేదు. చివరికి సరళా, కరుణాకర్ ఇద్దరే బయలుదేరాల్సి వచ్చింది. ఈ సారి ఏమైనా సరే తల్లిని తమతోపాటు తెచ్చుకోవాలనుకున్నాడు కరుణాకర్. సరళ కూడా అదే మాట అన్నది.

మీనాక్షమ్మకి ఇల్లు అప్పగించి మరీ మరీ జాగ్రత్తలు చెప్పి మద్రాసు బయల్దేరారు. రైల్లో రిజర్వేషన్ దొరక లేదు. పడుతూ లేస్తూ తెల్లారే మద్రాసు చేరుకున్నారు.

తీరా తమ్ముడి ఇంటికి వెళ్ళేసరికి తల్లి చివరి చూపులే దక్కాయి. తల్లి కరుణాకర్ చెయ్యి పట్టుకుని "పిల్లల్ని తీసుకు రాక పోయావా నాయనా?" అంది. అవే చివరి మాటలు. కరుణాకర్‌కి ఏడుపాగలేదు. తమ్ముడూ ఏడ్చాడు. అందర్లోకీ నిబ్బరంగా ఉంది చిన్న కోడలు మాత్రమే. కరుణాకర్ చెల్లెలూ, భర్తా ఆ ఉదయమే వచ్చారు రాజమండ్రి నుంచి.

సాయంకాలానికి దహనక్రియలు పూర్తయ్యాయి. తల్లి చివరి దశలోనైనా తన ఇంటికి తెచ్చుకోలేకపోయానే అని కరుణాకర్ వ్యథ చెందాడు. బిడ్డల్నీ చివరిగా చూపించ లేకపోయాడు. ఇంతలోనే ఇంత ముంచు కొస్తుందని కల్లో గూడా అనుకోలేదు. 'నీతో పాటు నన్నూ తీసుకుపోరా నాయనా' అన్న తల్లి మాటలే మాటి మాటికీ గుర్తు కొస్తుంటే అతనికి దుఃఖం ఆగలేదు.

సరళ, కరుణాకర్ రెండ్రోజులక్కడే ఉండిపోయారు. తల్లి చనిపోయినందుకే గాక, మరో కందుకూ కరుణాకర్ హృదయం గాయపడింది. తల్లి మిగిల్చి వెళ్ళిన ఆస్తి కోసం ఆ పరిస్థితి లోనే చెల్లెలూ, ఆడబిడ్డా తలపడ్డారు. తల్లి ఒంటి మీద బంగారం తనకే రావాలంటుంది చెల్లెలు. ఇన్నాళ్ళూ పెట్టి పోషించింది తాము గాబట్టి ఆమె ఆస్తిపాస్తుల్లో మరెవ్వరికీ వాటా లేదంటుంది చిన్న కోడలు.

చెల్లెలు కూడా బంగారం కంటే కనిపెంచిన తల్లిని హీనం చెయ్యగలిగినంత కఠినురాలు ఎలా కాగలిగిందా అని కరుణాకర్ ఆశ్చర్యపడ్డాడు.

సరళ వాళ్ళ మీద ఎంతో అసహ్యం వేసింది. అక్కడిక ఒక్క క్షణం ఉండ బుద్ధి కాలేదు. ఆ రాత్రే ఇద్దరూ ఇంటికి బయల్దేరారు.

తల్లి పూజ సామగ్రి తనతో తెచ్చుకున్నాడు కరుణాకర్.

★ ★ ★

కొయ్య గేటు కిర్రు మనగానే ఎప్పటి లాగా కుక్కపిల్ల వచ్చి కాళ్ళ కడ్డం పడలేదు.

శాంతి ఏడుస్తూ వచ్చి అతన్ని వాటేసుకుంది.

"నాన్నా మరే.... మన కుక్క పిల్ల చచ్చిపోయింది". అంటూ చెప్పింది వెక్కిళ్ళ మధ్య.

కరుణాకర్ మనస్సు చివుక్కుమంది. సరళ శాంతి నెత్తుకుని ఓదార్చింది. ఇంతలో సీను వచ్చి కుక్క పిల్ల ఎలా చనిపోయిందీ చెప్పాడు. పప్పీ అప్పుడప్పుడూ బయటికి కెళ్తున్నట్టుగానే క్రిందటి రోజు వీధిలోకి పరిగెత్తింది. శాంతికి చిక్క లేదు. సీను ఇంట్లో లేడు. తిరిగి తిరిగి ఏ వీధిలోకి వెళ్ళిందో బజారు కుక్కలు దాని వెంటపడి కరిచాయి. వంటి నిండా గాయలయ్యాయి. సాయంకాలానికి చనిపోయిందది.

సీను అమ్మనీ, నాన్ననీ పెరట్లోకి తీసుకుపోయి గోడ పక్కగా ఒక చోటు చూపించాడు. శాంతి, సీనూ కలిసి కుక్క పిల్ల నక్కడ భద్రంగా పాతి పెట్టారు. దాని మీద పువ్వులున్నాయి. ఎందుకో కరుణాకర్ మనస్సులో బాధ సుళ్ళు తిరిగింది. కుక్క పిల్ల మెళ్ళో ఉండాల్సిన గొలుసు వెక్కిరిస్తూ అక్కడ కనిపించింది.

"నిన్నటి నుంచీ పిల్ల అన్నం ముట్టు కోవటం లేదమ్మా!" అంది మీనాక్షి సరళతో.

తల్లి మరణ వార్త పిల్లల కెలా చెప్పాలో కరుణాకర్‌కి తోచ లేదు. చివరికి సరళే శాంతితో అన్నది. "శాంతీ! మీ నాయనమ్మ దేవుడి దగ్గరి కెళ్ళిందే."

ఆ మాట శాంతి కెలాగో అర్థమైంది. శాంతికి ఏడుపాగ లేదు. ఆ రాత్రి అది తల్లి పక్కలో ఆమెను వాటేసుకు పడుకుంది. రాత్రంతా వెక్కిళ్ళు పెడుతూనే ఉంది నిద్రలో.

★ ★ ★

ప్రపంచ మంతటా కుక్కపిల్ల లున్నాయి పాపలు మాత్రమే అరుదుగా ఉన్నారు.

ఆంధ్రప్రభ వారపత్రిక